క్లుప్తంగా

నేడు భూభారతిపై అవగాహన

దహెగాం: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూభారతిపై రైతులకు సోమవారం మండల కేంద్రంలోని స్థానిక రైతు వేదికలో అవగాహన కల్పించనున్నట్లు ఏవో రామక్రిష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవగాహన కార్యక్రమానికి ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ దండె విఠల్, ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు, జిల్లా కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, అడిషనల్ కలెక్టర్‌లు హాజరవుతారని పేర్కొన్నారు. మండలంలోని రైతులు భారీగా హాజరు కావాలని కోరారు.

నేడు రక్తదాన శిబిరం

రెబ్బెన: రెబ్బెన ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాల మాజీ చైర్మన్ స్వర్గీయ తుమికి ప్రభాకర్ రాజు 75వ వజ్రోత్సవ జయంతి సందర్భంగా సోమవారం మండల కేంద్రంలోని రెబ్బెన ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాలలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ జాకీర్ తెలిపారు. యువకులు, విద్యార్థులు ఈ రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తాన్ని దానం చేసి ఆపదలో ఉన్న వారికి ప్రాణదాతలుగా నిలవాలని కోరారు. రక్తదాతలకు ప్రోత్సాహకాలు అందజేస్తామని, ఆసక్తి గల రక్తదాతలు 84639 41549, 90308 74318, 73374 21620 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

పతంజలి కమిటీ ఎన్నిక



పతంజలి నూతన కమిటీ సభ్యులు

కౌటాల: మండల కేంద్రంలోని రామాలయ ప్రాంగణంలో పతంజలి భారత స్వాభిమాన్ మండల నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. కమిటీ మండల అధ్యక్షుడిగా కే. దౌలత్, ఉపాధ్యక్షుడిగా ఎం. బ్రహ్మయ్య, ప్రధాన కార్యదర్శిగా సత్యనారాయణ, కోశాధికారిగా విజయ్ కుమార్, కార్యదర్శిగా అశోక్, శ్రేష్ఠ కార్యకర్త వంశీ, సభ్యులు అఖిల్ సింగ్, నాగచైతన్యలను ఎన్నుకున్నారు. సంఘం బలోపేతం కోసం కృషి చేస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.రవీంద్రగౌడ్, దాసరి వినోద్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

పాముకాటుతో ఒకరి మృతి



వేముల లక్ష్మణ్ (ఫైల్)

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని శ్రీకృష్ణకాలనీకి చెందిన వేముల లక్ష్మణ్ (50) ఆదివారం తెల్లవారుజామున పాము కాటుకు గురై మృతి చెందారు. తెల్లవారుజామున నిద్రలేచి కాలకృత్యాలు తీర్చుకునేందుకు బయటకు వెళ్లగా పాముకాటుకు గురయ్యారు. ఈవిషయాన్ని గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. లక్ష్మణ్‌ను పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు ధ్రువీకరించారని కుటుంబ సభ్యులు తెలిపారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు అందజేత



ఫోన్‌లు అందజేస్తున్న ఎస్సై ప్రవీణ్ కుమార్

బెజ్జూర్: పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను ఎస్సై ప్రవీణ్ కుమార్ ఆదివారం పోలీసు స్టేషన్‌లో బాధితులకు అందజేశారు. దహెగాం మండలానికి చెందిన గురిజాల సాయి, బెజ్జూర్ మండలం కాటేపల్లికి చెందిన గుండ్ల నాందేవ్‌లు ఇటీవల సెల్‌ఫోన్లను పోగొట్టుకున్నారు. సీఈఐఆర్ పోర్టల్ ట్రేస్‌చేసి బాధితులకు సెల్‌ఫోన్లను అప్పగించినట్లు పేర్కొన్నారు. ఎవరైనా మొబైల్ పోగొట్టుకుంటే సీఈఐఆర్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని, వెంటనే బ్లాక్ చేసి పోగొట్టుకున్న ఫోన్‌లను తిరిగి రికవరీ చేస్తామని వివరించారు.

'స్థానిక ఎన్నికల్లో బీజేపీ గెలుపునకు కృషి చేయాలి'



మాట్లాడుతున్న విశాల్ ఖాండ్రే

కెరమెరి: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పాగా వేయాలని, పోటీచేసే అన్ని స్థానాల్లో అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు, కెరమెరి ఇన్‌చార్జి విశాల్ ఖాండ్రే అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాదికి పైగా గడుస్తున్నా ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందన్నారు. మండలాధ్యక్షుడు సెడ్మకి తుకారాం, నాయకులు వెంకటేష్, రంగు శ్రీకాంత్, ఉత్తం, రాజు, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ఇంకుడు గుంత.. లాభం కొండంత

- జిల్లాకు 93,526 ఇంకుడు గుంతలు మంజూరు
- భూగర్భ జలాల పెరుగుదలకు అవకాశం
- మురుగునీరుకు స్వస్తి
- నిర్మాణానికి ప్రభుత్వ నిధులు

కౌటాల: జిల్లాలో మండుతున్న ఎండల నేపథ్యంలో బోర్లు, బావులు ఎండిపోతున్నాయి. భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. ఎక్కడ చూసినా నీటి సమస్య ఉంది. ఈ పరిస్థితిని అధిగమించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధిహామీ పథకంలో భాగంగా వ్యక్తిగత, సామూహిక ఇంకుడు గుంతలు నిర్మించాలని నిర్ణయించాయి. వీటి నిర్మాణానికి ఉపాధిహామీ పథకం కింద నిధులు వెచ్చిస్తోంది. ఇంకుడు గుంతల వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. భూగర్భ జలాల పెంపునకు ఇవి ఎంతగానో ఉపయోగపడుతాయి. పల్లె ప్రాంతాల్లో మురుగు కాలువలు, మురుగు నీరు, ఈగలకు, దోమలకు ఆవాసంగా మారుతున్న నిల్వ నీటి నుంచి విముక్తి కలుగుతుంది. ఆయా ప్రాంతాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవచ్చు. వీటి నిర్మాణాలపై అధికారులు విస్తృత ప్రచారం చేయాలని పలువురు కోరుతున్నారు. మహాత్మా గాంధీ ఉపాధిహామీ పథకంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు రూ.43 కోట్ల నిధులతో 93,526 ఇంకుడు గుంతలు మంజూరు చేసింది. ఇందులో 29,114 గుంతల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. 38,877 ఇంకుడు గుంతలను నిర్మించారు. ఇంకా 25,535 ఇంకుడు గుంతల పనులు ప్రారంభించాల్సి ఉంది.

నిర్మించే విధానం..

ఇంటి పరిసరాల్లో వర్షపు నీరు, మురుగు నీరు ఇంకిపోయేందుకు 4 అడుగుల పొడవు, 4 అడుగుల వెడల్పు, 6 అడుగుల లోతు గుంత తీయాలి. గుంత



వ్యక్తిగత ఇంకుడు గుంత

అడుగు భాగంలో 45 సెం.మీల వరకు 225 ఎంఎం గులకరాళ్లతో, మధ్యలో 45 సెంమీ 60 ఎంఎం కంకర రాళ్లతో నింపాలి. మూడు అడుగుల సిమెంట్ ట్యాంకును గుంత మధ్య భాగంలో అమర్చాలి. ఇంటి పైకప్పు వర్షపు నీరు, మురుగు నీరు ట్యాంకు లోపలికి వెళ్లేలా 5 మీటర్ల పైపు ఏర్పాటు చే యాలి. సిమెంట్ ట్యాంకు చుట్టూ 20 ఎంఎం కంక ర రాళ్లతో ఇసుక మిశ్రమంతో నేల సమభాగం వ రకు నింపాలి. ట్యాంకును పైకప్పుతో మూసివేయాలి.

సామూహిక ప్రాంతాల్లో ఇలా..

గ్రామాల్లో అంతర్గత రహదారుల వెంట ఉండే మురుగు నీటి కాలువలు దోమలకు ఆవాసంగా మారుతున్నాయి. చేతి పంపుల వద్ద నీరు పల్లపు ప్రాంతంలోకి ప్రవహించి అక్కడ బురదగా మారుతుంది. ఈ నీరు ఇంకేందుకు ప్రతీ పంచాయతీకి సామూహికంగా మూడు ఇంకుడు గుంతలు మంజూరు చేశారు. వీటికి రూ.12వేల వరకు ఉపాధి హామీ నిధులు ఇవ్వనున్నారు. దీని నిర్మాణం 2మీ. పొడవు, 2మీ.వెడల్పు, 2మీ. లోతు గుంత త వ్వాలి. అడుగు భాగంలో 3 అడుగుల వరకు 225 ఎం.ఎం కంకర రాళ్లతో నింపాలి. పై భాగంలో 30 సెం.మీ. 20 ఎం.ఎం కంకర రాళ్లతో ఇసుక మిశ్రమంతో నేల సమభాగం వరకు నింపాలి. చేతి పంపు నీరు, మురుగు నీరు పైపును గుంతలోకి పంపాలి.

గుంత నిర్మాణానికి తోడ్పాటు..

ఇంటి ఆవరణలో ఇంకుడు గుంత నిర్మాణానికి గతంలో ఉపాధిహామీ కింద రూ. 4 వేలు చెల్లించేవారు. ప్రస్తుతం రూ. 6 వేలకు పెంచారు. ఉపాధిహామీ జాబ్‌కార్డుదారులు వీటికి అర్హులు. వ్యక్తిగతంగా, సామూహికంగా నిర్మించుకునే అవకాశం ఉంది. వీటి కోసం ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలి. వాటి ఆధారంగా క్షేత్ర సాంకేతిక సహాయకులు ఇంటిని పరిశీలించి ప్రతిపాదనలు చేస్తారు. దీని ఆధారంగా నిధులు మంజూరవుతాయి. ఇంకుడు గుంత నిర్మాణం చేపట్టగానే ఉపాధిహామీ అధికారులు గ్రామ పంచాయతీ ఖాతాలో డబ్బులు జమ చేస్తారు. పంచాయతీ అధికారులు గుంత నిర్మించుకున్నారా.. లేదా.. అని క్షేత్రస్థాయిలో పరిశీలించి లబ్ధిదారుడికి డబ్బులు అందజేస్తారు. చేతి పంపుల వద్ద సామూహిక ఇంకుడుగుంత నిర్మాణానికి ఒక్కో దానికి రూ.12 వేలు చెల్లిస్తారు.

ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలి



ప్రతి ఒక్కరూ ఇంకుడు గుంతలు నిర్మించాలి. జల సంరక్షణ కోసం ప్రతిఒక్కరూ పాటుపడాలి. దీంతో మురికి నీరు, దోమల బెడద ఉండదు. వ్యక్తిగత ఇంకుడు గుంత నిర్మాణానికి రూ. 6వేలు, సామూహిక ఇంకుడు గుంతకు రూ. 12 వేలు చెల్లిస్తాం. ఆసక్తి గలవారు స్థానిక ఎంపీడీవో, ఈజీఎస్ కార్యాలయాల్లో సంప్రదించవచ్చు.

– పూర్ణిమ, ఏపీవో, కౌటాల

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని శ్రీ రేవతి ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుకున్న 2003 –2004 బ్యాచ్ విద్యార్థులు పట్టణంలోని ఎస్ఎం గార్డెన్స్‌లో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహించారు. చిన్ననాటి మిత్రులు కలిసి చదువుకున్న పాత రోజులను గుర్తుచేసుకున్నారు. ఉపాధ్యాయులు డిల్లీ విజయ్‌కుమార్, మార ఉష, శోభ, శ్రీనాథ్, హనుమాన్‌చారి, విద్యార్థులు చీల నితీశ్, రేకల మల్లేశ్, శ్రీనివాస్, సంతోష్, స్వప్నీల్, హరీశ్, రాజేశ్, నారాయణ, కిరణ్, ఇమ్రాన్, శారద, వీణ, సారిక, శ్వేత, సౌమ్య తదితరులు పాల్గొన్నారు.

కనకదుర్గాదేవి ఆలయంలో భక్తుల పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

రెబ్బెన: మండలంలోని ఇందిరానగర్‌లో గల కనక దుర్గాదేవి, స్వయంభూ మహంకాళి ఆలయంలో ఆదివారం భక్తులు పోటెత్తారు. మండలంలోని భక్తులతో పాటు చుట్టు పక్కల మండలాల నుంచి భారీగా భక్తులు తరలివచ్చి దుర్గామాత, మహంకాళి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులు అమ్మవారికి ఒడిబియ్యం, పట్టువస్త్రాలు, నైవేద్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న శనీశ్వరుడు, కాలభైరవస్వామి, అరుణాచల శివుడు, నాగదేవత విగ్రహాలను దర్శించుకుని పూజలు చేశారు. రుయ్యాడిలోని ప్రముఖ హస్సన్ హుస్సేన్ దేవస్థాన పూజారి అశోక్ సతీసమేతంగా వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు దేవార వినోద్ భక్తులకు అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

స్వయం ఉపాధి శిక్షణ వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న దుర్గం మల్లయ్య

వాంకిడి: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ కార్యక్రమాన్ని జిల్లాలోని యువతీ యువకులు వినియోగించుకోవాలని ఆ సంస్థ సభ్యుడు దుర్గం మల్లయ్య అన్నారు. వాంకిడి మండలం ధాబా గ్రామంలో ఆదివారం స్వయం ఉపాధి శిక్షణపై అవగాహన కల్పించారు. గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఉట్నూర్ ఆధ్వర్యంలో సోమవారం నుంచి మహిళలకు మగ్గం వర్క్ శిక్షణ ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. అలాగే బ్యూటీ పార్లర్, కుట్టు మిషన్, హౌజ్ వైరింగ్, టూవీలర్, సెల్‌ఫోన్ రిపేరింగ్, ఫొటో, వీడియోగ్రఫీపై శిక్షణ అందిస్తున్నట్లు వివరించారు. మే 10 లోపు దరఖాస్తు చేసుకోవాలని, ఆసక్తి గల వారు ఆధార్, రేషన్ కార్డు, పదో తరగతి మెమో, కుల ధ్రువీకరణ పత్రం, రెండు ఫొటోలతో ఉట్నూర్‌లోని కేబీ కాంప్లెక్స్‌కు రావాలని సూచించారు. 30 రోజుల శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి, యూనిఫామ్, శిక్షణ అనంతరం ధ్రువీకరణ పత్రం, టూల్ కిట్, బస్ టికెట్ చార్జీలు ఇస్తామని తెలిపారు. వివరాలకు 80960 93085, 99494 12159 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

మహిళా ఉద్యోగులకు క్రీడాపోటీలు



మాట్లాడుతున్న తిరుపతి

రెబ్బెన(ఆసిఫాబాద్): ప్రపంచ కార్మికుల దినోత్సవం మే డేను పురస్కరించుకుని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో బెల్లంపల్లి ఏరియాలో పని చేస్తున్న మహిళా ఉద్యోగులకు క్రీడాపోటీలను నిర్వహిస్తున్నట్లు గోలేటి బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి తెలిపారు. గోలేటి టౌన్‌షిప్‌లోని కేఎల్ మహేంద్ర భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. 139వ మేడే సందర్భంగా ఏరియాలోని కైరి గూడ ఓసీపీతో పాటు వివిధ డిపార్టుమెంట్ల లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులకు పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 28న ఉదయం 7 గంటలకు గోలేటి సీహెచ్‌పీ, అదేరోజు సాయంత్రం 4 గంటలకు జీఎం కార్యాలయం, 29న ఉదయం 7 గంటలకు కైరిగూడ ఓసీపీ, 30న ఉదయం 7 గంటలకు ఏరియా వర్క్‌షాప్‌లో పోటీలు కొనసాగుతాయని పేర్కొన్నారు. సమావేశంలో బ్రాంచి ఉపాధ్యక్షుడు బయ్య మొగిలి, ఆర్గనైజింగ్ కార్యదర్శులు శేషశయన రావు, జగ్గయ్య, కిరణ్‌బాబు, చంద్రశేఖర్, పిట్ కార్యదర్శి మారం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు సద్వినియోగం చేసుకోవాలి

ఆసిఫాబాద్: జిల్లాలోని గ్రంథాలయాలను పాఠకులు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ ప్రొఫెసర్ రియాజ్ అహ్మద్ అన్నారు. జిల్లా కేంద్రంలోని గ్రంథాలయాన్ని ఆదివారం సందర్శించారు. పాఠకుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వేసవికాలం దృష్ట్యా చల్లని మంచినీటి సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. పెద్దపెల్లి గ్రంథాలయ సంస్థ చైర్మన్ అన్నయ్య గౌడ్, కాంగ్రెస్ ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి సుగుణక్క, లైబ్రరియన్ సదానందం, వెంకటరమణ, సతీదేవి ఉన్నారు.

'చలో వరంగల్'కు బీఆర్ఎస్ నాయకులు

- ఘనంగా పార్టీ ఆవిర్భావ వేడుకలు



ఆసిఫాబాద్: బీఆర్ఎస్ నాయకులతో కలిసి వెళ్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

దహెగాం: బీఆర్ఎస్ తలపెట్టిన చలో వరంగల్ సభకు మండల బీఆర్ఎస్ నాయకులు తరలివెళ్లారు. మండల కేంద్రంలో బీఆర్ఎస్ జెండాను ఎగురవేసి జై తెలంగాణ అంటూ నినాదాలు చేశారు. మండల కన్వీనర్ షాకీర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ కార్యకర్తలు బస్సులో వరంగల్‌కు బయలు దేరారు. నాయకులు ప్రశాంత్, లక్ష్మి పాల్గొన్నారు.

జిల్లాకేంద్రంలో..

ఆసిఫాబాద్: వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో ఆదివారం నిర్వహించిన బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకలకు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ శ్రేణులు ప్రత్యేక వాహనాల్లో తరలివెళ్లారు. మాజీ జెడ్పీటీసీ అరుణ, అలిబిన్ అహ్మద్, తాజ్, జాబరి రవీందర్, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

రెబ్బెనలో..

రెబ్బెన: చలో వరంగల్ బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభకు మండలం నుంచి భారీగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. మండలం నుంచి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనాల్లో భారీగా పార్టీ శ్రేణులు సభకు తరలివెళ్లారు. గోలేటిలోని టీబీజీకేఎస్ కార్యాలయ ఆవరణలో తెలంగాణ తల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి యూనియన్, పార్టీ నాయకులు సభకు తరలివెళ్లారు. మండల కేంద్రంలోని గంగాపూర్ కమాన్ వద్ద సిర్పూర్ (యూ) మాజీ జెడ్పీటీసీ కోవ అరుణ మండలానికి చెందిన పార్టీ నాయకులతో కలిసి చలో వరంగల్ పోస్టర్లను ఆవిష్కరించారు. పార్టీ మండల అధ్యక్షుడు పోటు శ్రీధర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కార్నాథం సంజీవ్‌కుమార్, టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రావు ఉన్నారు.

కౌటాలలో..

కౌటాల: మండల కేంద్రంలోని కుమురం భీం చౌరస్తాలో ఆదివారం బీఆర్ఎస్ పార్టీ జెండాను పార్టీ నాయకులు ఎగురవేసి బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ సీనియర్ నాయకులు నక్క శంకర్ మాట్లాడుతూ బీఆర్ఎస్ 14 ఏళ్ల పోరాటంతోనే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సాధ్యమైందన్నారు. బీఆర్ఎస్‌తోనే దేశాభివృద్ధి సాధ్యమని, రానున్న ఎన్నికల్లో పార్టీకి పూర్వ వైభవం వస్తుందన్నారు. పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటుందని, పార్టీ బలోపేతం కోసం ప్రతి కార్యకర్త పాటుపడాలన్నారు. నాయకులు నాగపూరే బండు, గోవింద్ రావు, సందీప్, నవీన్, ముక్తేశ్వర్, కార్తీక్, తదితరులు ఉన్నారు.



దహెగాం: బీఆర్ఎస్ జెండావిష్కరిస్తున్న నాయకులు



రెబ్బెన: సభకు తరలివెళ్తున్న కార్యకర్తలు



కౌటాలలో పార్టీ ఆవిర్భావ వేడుకల్లో కార్యకర్తలు

సైబర్ నేరగాళ్లతో జాగ్రత్త



మాట్లాడుతున్న ఎస్సై మధుకర్

కెరమెరి: అనవసర, అపరిచిత వ్యక్తుల ద్వారా వచ్చే ఫోన్ కాల్స్ లిఫ్ట్ చేయొద్దని, సైబర్ నేరగాళ్లతో జాగ్రత్తగా ఉండాలని కెరమెరి ఎస్సై మధుకర్ అన్నారు. ఆదివారం మండలంలోని చిన్నసాకడ గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటీపీ నంబర్లు కొత్త వ్యక్తులకు చెప్పొద్దని, ఏదైనా అనుమానం కలిగితే 1930, 100కు డయల్ చేయాలని పేర్కొన్నారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడపరాదని, అతి వేగంగా, హెల్మెట్ లేకుండా వాహనం నడిపితే కేసులు నమోదు చేస్తామన్నారు. అనంతరం ఆదివాసీ యువకులకు వాలీబాల్ కిట్ అందజేశారు.


ఈదురుగాలుల బీభత్సం



ఈదురుగాలులకు గోలేటి టౌన్‌షిప్‌లో విరిగిపడిన చెట్టు కొమ్మ

రెబ్బెన: మండలంలో శనివారం అర్ధరాత్రి వీచిన బలమైన ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై చిరుజల్లులకు బలమైన ఈదురుగాలులు తోడవడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. బలమైన గాలులు వేగంగా వీచడంతో గోలేటిలోని కార్మిక వాడల్లో చెట్లు, చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. ఈదురుగాలుల కారణంగా అర్ధరాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు మండలానికి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దాంతో రాత్రిపూట కరెంట్ లేక ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు.

పంట రక్షణకు పాట్లు



మొక్కజొన్న పంట చుట్టూ సౌర విద్యుత్ వైరు

కెరమెరి: కోతులు, పందులు, పక్షుల బెడద నుంచి పంటలను కాపాడుకునేందుకు రైతులు నానా పాట్లు పడుతున్నారు. పంటల రక్షణకు కొంతమంది రైతులు బాణాసంచాలు కాలుస్తుండగా, కొందరు దిష్టిబొమ్మలు అమర్చుతున్నారు. కొందరు కర్రలకు సీసాలు, బియ్యం సంచులు కట్టి పంటలను పక్షుల బారినుంచి కాపాడుకుంటున్నారు. కొందరు అతి తక్కువ పెట్టుబడితో సోలార్ కంచెలు ఏర్పాటు చేసుకుంటున్నారు.



పిట్టల బారి నుంచి కాపాడేందుకు కర్రకు అమర్చిన సీసాలు, సంచులు

క్రీడలతో మానసికోల్లాసం



వాలీబాల్ కిట్ అందజేస్తున్న ఎస్సై ప్రవీణ్ కుమార్

బెజ్జూర్: చదువుతో పాటు యువత క్రీడల్లో రాణించాలని బెజ్జూర్ ఎస్సై ప్రవీణ్ కుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని ముంజంపల్లి గ్రామంలో క్రీడాకారులకు వాలీబాల్ కిట్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దారుఢ్యం పెరుగుతుందని పేర్కొన్నారు. క్రీడా నైపుణ్యాలను పెంచుకొని రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.